# కథనకుతూహలం

రాకరాక మా ఇంటికొచ్చింది నాయనమ్మ. అమ్మా నాన్నా ఓపికగా కూర్చుని నవారు బిగించి ఆమెకోసం పట్టెమంచం వేశారు. ఆమె పక్కలోనే చేరిపోయాను. ఈ దోస్తీ వారం రోజులు బాగానే సాగింది. "అమ్మాయీ! ఈ వెధవాయిని తీసుకుపో" అంది ఒక రాత్రి. నాయనమ్మకు ఆడపిల్లలు లేక కోడళ్ళను అమ్మడూ, అమ్మాయీ అని పిలిచేది.

"ఏమైందత్తయ్యా! పక్క తడిపేశాడా?" అని అడిగింది అమ్మ.

"అయ్యో పాపం. అదేమీకాదే. రోజూ కథ చెప్పమని నస. నేనేమన్నా ఊట బావినా ఏం?" అని నవ్వింది.

"మొన్న వీధి చివర దుకాణంలో ఒక అగ్గి పెట్టెకొని తెచ్చి పెట్టరా అన్నాను. అలాగే - కానీ, కథ చెప్తానంటే తెస్తాను అని షరతు పెట్టాడు." అని నాయనమ్మ నవ్వుతో శృతి కలిపింది అమ్మ. అదేనా సందర్భం నామీద చాడీ చెప్పడానికి? అలా చిన్నతనంలో నాకు కథల పిచ్చి అన్న విశేషణం మా ఇంట తగిలించేశారు. ఎదురింటి గోవిందు నాతో కారమ్స్ ఆడటానికి వచ్చినప్పుడు వాణ్ణి ఓడగొట్టి, ముందుగా పెట్టిన షరతు ప్రకారం ఓడిన నేరానికి కథ చెప్పమనేవాడిని.

అయితే, నేను తెలుగూ ఇంగ్లీషూ చదివి అర్థం చేసుకో గలిగిన వయస్సు వచ్చాక ఎవరినీ బాధ పెట్టకుండా కథలు వినే నా వ్యసనం చదువుకునే వ్యసనంగా మారిపోయింది. ఎంతో స్వేచ్ఛనీ ఆనందాన్నీ అనుభవించాను. బస్సులోనో రైల్లోనో కిటికీ దగ్గర సీటు దొరికినంతగా సంతోషించి నా చుట్టూ ప్రపంచాన్ని కథల్లో చూసుకొనేవాడిని. ఒక రోజు కథ రాయాలన్న దుర్బుద్ధి కూడా కలక్కపోలేదు. కాగితాలూ కలం పట్టుకొని, గది తలుపులు మూసుకున్నాను. గళం సవరించుకొనే గాయకుడిలాగ కూర్చుని సీరియస్‌గా ఒక పేరా ఏదో రాశాను. ఇక ఆ కథ నడవలేదు. ఇంతలో నా దృష్టి అలమరాలోని ఒక పుస్తకం మీద వాలింది. ఒక కథ ఆ పట్టాన చదివి పూర్తి చేశాను. నా కళ్ళలో నీళ్ళు. అప్పుడే తలుపుతట్టి లోనికి వచ్చిన గోవిందు - అదేమిరా ఏడుస్తున్నావ్ అన్నాడు. అబ్బే ఏడుపు కాదురా, ఆనంద బాష్పాలు ఇవి. ఈ కథ చదువు. ఎన్ని జన్మలెత్తినా, తలక్రిందుగా తపస్సుచేసినా ఇలాటి కథ రాయగలరా ఎవరన్నా? అని అడిగాను. వాటి కంటపడకుండా నే రాస్తున్న కాగితం చింపి చెత్తబుట్టలో వేశాను. అలా నాలో ఇక మిగిలిపోయింది కేవలం చదివే వ్యసనం మాత్రమే. రాచ పీనుగ తోడులేందే పోదని కథ ఎప్పుడో చదివాను కానీ వ్యసనం కూడా ఒక తోడు కోరుతుందని అనిపిస్తూవుంటుంది. పాన్‌కి అలవాటు పడ్డవాడు సిగరెట్టు కావాలనుకుంటాడట. నేను చిరుద్యోగినై సాయంత్రం కాలేజీలో న్యాయశాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు సాంస్కృతిక సమితి కార్యదర్శిగా నిలబడ్డాను. అప్పుడు కొత్త వ్యసనం తలెత్తింది. రచయితల్ని వెంటాడి, పిలిచి మాట్లాడించి ఆటోగ్రాఫ్‌లు తీసుకుని మురిసిపోవడం. కొందరు నామీద జాలిపడి ప్రేమతో వచ్చేవారు. కొందరు యక్షప్రశ్నలు వేసి విసవిసలాడుతూ వచ్చేవారు.

లా డిగ్రీ కారణంగానేమో పేరున్న బ్యాంక్‌లో మంచి ఉద్యోగమేవచ్చింది. ఇక బాలన్స్ షీట్లు, కొత్తకొత్త ప్రాజెక్టులు, నిర్ణయాలు బుర్రలో చోటు చేసుకుని పూర్తిగా ఆక్రమించేశాయి. ఇంట్లో అనుకూలవతి భార్య, అల్లరి ఎరుగని పిల్లలు సరేసరి. నగర శివార్లలో ఒక గ్రామానికానుకొని వెలుస్తున్న కాలనీలో ఇల్లు కొన్నాను. విదేశం వెళ్ళిపోతూ ఒక స్నేహితుడు చౌకగా ఇచ్చిన కారు నా జీవన శైలిని పెంచేసింది. ఏదో ఇంగ్లీషు సినిమా కథలాగ సరిగ్గా ఏడేళ్ళు గడిచాయో లేదో నిద్రాణమైన వ్యసనం

మళ్ళీ తలెత్తింది. ఎదురుచూడకుండానే మామగారు ఇచ్చిపోయిన ఆస్తితో ఒక ట్రస్టు ఆయన పేర ఏర్పాటు చేశాను. ప్రతి ఏటా మా కాలనీలోని విద్యార్థుల్లో ఎక్కువ శాతం మార్కులు పరీక్షల్లో తెచ్చుకున్న వారికి ప్రోత్సాహక బహుమతులు ప్రకటించడం, వాటిని ఒక ప్రముఖ రచయిత చేతి మీదగా ప్రదానం చేయించడం, ఆ రచయితను సత్కరించడం మా వార్షిక కార్యక్రమంగా కొన్ని ఏళ్లు బాగానే సాగింది. ప్రముఖ రచయితలు ప్రసన్నంగా వచ్చి పిల్లలనూ నన్నూ దీవించి వెళ్ళారు. కానీ, క్రమంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. వాళ్ళకు కాలమెంతో అమూల్యమైనదని మా కోసం నగరం విడిచి ఎంతో దూరం రావలసి ఉంటుందనీ కారులో తీసుకొచ్చి వారిని తిరిగి ఇంటి వద్ద దిగబెట్టే ఏర్పాటు కూడా చేశాను. "మీకు అదేదో యూనివర్సిటీలో పలుకుబడి ఉందా? ఏదో అకాడమీలో ఫలానా వారితో ఒక మాట చెప్పగలరా? మీ కార్యక్రమానికి అంత దూరం దూరదర్శన్ వాళ్ళు వస్తారా? పత్రికల వాళ్ళకు చెప్తారా?" - ఇలాంటి ప్రశ్నలు వేసి ఇబ్బంధి పెట్టేవారు కొందరు. ఎంతో పలుకుబడిగల ఘరానా మనిషిగా నన్ను అంచనావేసేవారు. వేదిక మీద ఇంకెవరెవరు ఉంటారు అని ముందుగానే యక్షప్రశ్నలు వేసి ఆ తర్వాత నాకు వీలుపడదు, మీ కార్యక్రమం ఇంకో తారీఖున పెట్టుకోమని సలహా ఇచ్చేవారు.

ఒక ఏడు నా మిత్రుడు - పత్రికలో పనిచేసే పేర్రాజును అడిగాను - మంచి సాహితీవేత్త పేరును సూచించమని. 'నువ్వు కొనుక్కున్న ఇంటికి దగ్గర ఖానాపురం గ్రామంలో అంగీరస ఉన్నారుగా' అన్నాడు.

ఆ పేరు నేవిన్న గుర్తులేదే - అన్నాను.

"పుట్టిన తెలుగు సంవత్సరాన్నే కలంపేరుగా వాడి శేఖరం మంచికథలు అప్పుడప్పుడు రాశారు." - అన్నాడు.

డాక్టరు సలహాతో నే సాగిస్తున్న వేకువజాము నడకను కాస్తంత పొడిగించి, ఒక ఉదయం ఖానాపురం గ్రామం పొలిమేరల్లో పాతమిద్దె ఇంటి వాకిట నిలబడ్డాను. శేఖరంగారిల్లు ఇదేనా అని అడగవలసింది. నాలిక మీద ఉన్నపేరు రాలి, 'అంగీరస' గారి ఇల్లేనా అని అడిగాను. ముగ్గువేస్తున్న ఆ ఇంటి ఇల్లాలు కాసింత గట్టిగానే

నవ్వుతూ 'అదిగో అంగీరస గారు ఆ గిలకబావి కెదురుగా సంపెంగ పాదకావల' అని లేత ఎండలో వార్తాపత్రిక చదువుతున్న శాస్త్రీని చూపించింది.

నా ప్రశ్నా ఆమె నవ్వూ విన్నట్లే ఉన్నాడు. "ముప్పైఏళ్ళకు పైగానే ఇక్కడ ఉంటున్నాను. నన్ను అంగీరస అని గుర్తించి పిలిచిన వాళ్ళెవరూ లేరు. అప్పుడప్పుడు నా భార్య హాస్యానికి అంగీరసగారూ భోజనానికి లేస్తారా? అంటూ వుంటుంది అన్నాడు, కాసింత మాసిన గడ్డం, నలిగిన పంచె, చిరిగిన బనీన్‌తో ముచ్చటగా నవ్వుతూ. పేర్రాజు పేరు ప్రస్తావించి నన్నూ నా కార్యక్రమాన్నీ స్థూలంగా పరిచయం చేసుకున్నాను. స్పష్టంగా మీరే బహుమతి ప్రదానం చెయ్యడానికి ఈమారు రావాలంటూ ఇంకా అడగనే లేదు. అతన్ని ఏ కారణంగానో ఎన్నడూ నేను చూడ్డం కానీ ప్రసంగించగా వినడంకానీ జరగనేలేదు. కానీ మనసుని చదవగల నేర్పరిలాగే ఉన్నాడు.

"మీ ప్రయత్నం ఉదాత్తమైనదే. అయితే నా మాట వినండి. ఈ గ్రామస్థులు అంగడిలో సరుకులకూ కూరగాయలకూ వెళ్ళినప్పుడు నన్ను ముప్పై ఏళ్ళుగా చూస్తూనే ఉన్నారు. కొత్తగా పుట్టుకొచ్చిన మీ కాలనీలోని వాళ్ళందరికీ కాస్తో కూస్తో పరిచయమైన ముఖమే నాది. నన్ను వేదిక మీద చూస్తే ప్రత్యేకమైన ఉత్కంఠ ఉండదు. అరుదైన వ్యక్తిని పిలవండి. సభ రక్తి కడుతుంది" - అన్నాడు. ఏం చెప్పాలో తట్టక నేను మౌనంగా ఉంటే ఓదార్పుగా "ప్రేక్షకుడిగా వచ్చి ఆనందిస్తాను" అని నన్ను చూస్తూ ముక్కుమీదగా జారిన సులోచనాలు సవరించుకొన్నాడు.

ఇంతలో వేడి తేనీటి కప్పులతో ఆయన భార్య వచ్చి మా ఇద్దరికీ అందించింది.

ఆ ఏడు ఇంకెవరినో పిలచి నా కార్యక్రమం అయిదనిపించేశాను. బహుమతి ప్రదానం చేసిన రచయిత శేఖరాన్ని గుర్తించి పాదాభివందనం చేశాడు. అలా ఏర్పడ్డ పరిచయం కారణంగా ఉదయంపూట ఎప్పుడైనా వెళ్ళి పలకరించడం జరిగేది. ఆ పాతకాలపు ఇల్లూ, గిలకబావీ, వేపచెట్టూ సంపంగిపాదా గ్రామ జీవితాన్ని గుర్తుకు తేవడమో, లేక వేడివేడి తేనీటిని సేవిస్తూ సాహిత్యం గురించి నాలుగుమాటలు పంచుకోవడమో నేను చెప్పలేను కానీ సూదంటురాయిలా ఆ అనుభవం నన్ను

రోజూ అటు పిల్చేది. ఆ మజిలీ ఉల్లాసాన్ని అందించేది. నే శేఖరాన్ని చూడకుంటే ఆ దినం సక్రమంగా సాగినట్లు తోచేదికాదు. ఆ తర్వాత అతని కథలు కొన్ని చదవకపోలేదు. చమక్కులూ ఆడంబరాలూ ఉండవు కానీ, ఇతి వృత్త బలంతోనూ సంఘటనల సహజత్వంతోనూ ఆకట్టుకుని ఆలోచనల వలయంలోకి నెట్టివేస్తాయి. కసీ, ద్వేషం, క్రౌర్య గుణాలకు ఎక్కువ దివిటీ పట్టవు.

ఒక ఉదయం అడిగాను. ఇదివరకెన్నడూ ఏ సాహిత్య సమావేశాల్లోనూ మీరు నాకు పరిచయం కాకపోవడం ఆశ్చర్యమే. మీరు రారేమో- అన్నాను.

'నే వెళ్ళిన సభకు మీరు రాకపోయి ఉండొచ్చుకదా' అని గడుసుగా తప్పుకున్నాడు. ఎక్కడో ఒక్కదగ్గరైనా తారసపడాలి కదా అన్నాను అంతటితో విడిచిపెట్టక.

"ఎంతదూరమైనా సభలకు చిక్కడపల్లి వెళ్ళకపోలేదు. సినిమాలు విడచే వేళ. బస్సులు తక్కువ. రద్దీ ఎక్కువ. ఆటోవాళ్ళు మీటరుకి రెండింతలు అడుగుతారు. బాగా ఆలస్యంగా తిరిగి రావడంతప్పుదు. అందుకే మానుకున్నాను." అన్నాడు క్లుప్తంగా.

అయితే మీరు వెళ్ళిన ఆఖరు సభా? - నే సాగదీశాను. పెదవి మెదిపేడు.. "నేను ఎంతో అభిమానించే రచయిత రాకరాక నగరానికి వస్తున్నాడనీ అతన్ని ఏదో సంస్థ సన్మానిస్తున్నాదనీ విని రచయితని చూడాలనీ, అతని అనుభవాలు నేను వినాలనీ పనికట్టుకు వెళ్ళాను."

ఊరికే కూర్చోలేక ఎవరండీ ఆయన? అని అడిగాను. "అది అప్రస్తుతం. పేరూ వివరాలూ అడిగి ఇబ్బంది పెట్టకుండా వినండి" అన్నాడు. ఇక నోరు కుట్టేసుకుని చెప్పినది వింటూ కూర్చున్నాను.

"నాకు జ్ఞానం వచ్చిన నాటి నుండీ అతని కథలు చదివాను. అభిమానించాను. కొంతవరకూ ఆ స్ఫూర్తితోనే నేనూ ఏదన్నా రాశానేమో. కానీ అతన్ని చూసే అవకాశం మాటలువినే అదృష్టం ఎందుకనో రాలేదు అప్పటిదాకా. కథాభిమానులూ రచయితలూ పత్రికలవాళ్ళూ ఇసుకవేస్తే రాలకుండా జనం వచ్చారు. రచయిత

సన్నగా జండా కొయ్యలా పొడుగ్గా ఉన్నాడు. సత్తెకాలపు చూపుతో అమాయకమైన అతని కథల్లాగే అతి నిరాడంబరంగా ఉన్నాడు. సభ మన అలవాటు ప్రకారం అర్థగంట ఆలస్యంగా మొదలుపెట్టారు. అతని గురించీ అతని రచనల గురించీ అతనితో వారికున్న సన్నిహిత సంబంధం గురించీ వక్తలు ఎవరో ఊదరగొట్టేసరికి ఎనిమిదిన్నర అయింది. చీటీలు పంపితే కానీ ఏ ఒక్కడూ మైకు విడవడాయె. సరే ఇక అతనికి శాలువ కప్పడం, సన్మానించడం తంతు జరిగింది. నేను నా ప్రక్కనే ఉన్నవాడి చేతి గడియారం చూశాను. తొమ్మిదీ. ఎవ్వరికీ అతన్ని మాట్లాడించి వినడం అతి ముఖ్యమన్న ఆత్రుత ఉన్నట్లు తోచలేదు చూస్తే. అప్పుడే అనుకోని అవాంతరం లా మైకులో ఒక ప్రకటన. ఇంకెవరో స్థానిక రచయిత పుస్తకం ఆనాటి సన్మాతుడి చేతిమీదుగానే ఆవిష్కరించాక ఆ పుస్తకాన్ని ఎవరో విశ్లేషిస్తారని దాని సారాంశం. అప్పటికప్పుడు ఒత్తిడి తెచ్చి మొహమాటపెట్టి ఇరికించిన పుస్తకావిష్కరణ అనీ, ప్రకటించిన కార్యక్రమంలో అది లేనేలేదనీ ధుమధులాడుతూ ఎవరో లేచి వెళ్ళిపోయారు. నేనూ పోవాలని ఉన్నా కొంచెం ఆశ పీకింది. ఆ తంతు పూర్తి అయినా విశ్లేషకుడు ఇంకా మైకు విడవకుంటే ఇక చీటీ పంపి, చప్పట్లుకొట్టి కూర్చోబెట్టారు. ఈ పిట్టకథలు ముగిశాక నా అభిమాన రచయిత బిక్కుబిక్కుమంటూ వాచీని చూసుకుని బాగా పల్చబడిపోయిన ఆడిటోరియమ్‌ని చూసుకొని ఐదునిముషాల్లో క్లుప్తంగా ధన్యవాదాలు తనను సన్మానించిన సంస్థకు చెప్పి ముగించాడు. నాకు ఆటో దొరికి ఇంటికి చేరుకున్నాక మనసులో బోలెడు అసంతృప్తితో పాటు చేతిలో ఒక పావలా కాసు మిగిలింది. ఆ తర్వాత సాహిత్య సభలకు వెళ్ళిన జ్ఞాపకం లేదు. ఒంట్లో ఓపికాలేదు" అన్నాడు - రెండు కళ్లూ మూసుకున్న శేఖరం.

ఇలా అనుభవాలు, అభిప్రాయాలు పంచుకొంటూ రోజు రోజుకీ మేమిద్దరం దగ్గరగా జరుగుతూ వచ్చాం. "మీరు డాక్టరు చెప్పిన నడకను తగ్గించేసి చెట్లనీడ మాటలు పొడిగిస్తున్నట్లున్నారు" నా శ్రీమతి మందలిస్తున్న ధోరణిలో అన్నది. మనసుకు ఆహ్లాదకరంగా ఉన్న మా ఉపనిషత్తులు ఆరోగ్యమే అని సమర్థించుకున్నాను.

వేడి తేనీరు చప్పరిస్తూ ఒక ఉదయం - మంచి కథకు అదేదో శిల్పం, శైలి, సంభాషణలు, సంఘటనలు ఉండాలి అంటూవుంటారు కదా. మీ దృష్టిలో ఏది ముఖ్యం కథకు అని అడిగాను.

"నాకు మాత్రం తెలుసాయేమిటి. నా మట్టుకు కథనంలో నిజాయితీ ముఖ్యం అనుకుంటాను" అన్నాడు ఒక వేదాంతిలాగా. అది విన్నాక నాకు నవ్వుతో పాటూ ఒక హిందీ పాట గుర్తొచ్చింది. 'జిందగీ ఖ్వాబ్‌హై - ఖ్వాబ్‌మే ఝూట్‌క్యా' అన్నట్టు పల్లవితో ప్రారంభమౌతుంది.

'ఎందుకు నవ్వుతున్నారు' అన్నాడు కళ్ళు చికిలిస్తూ. కథలే కల్పనలు కదా, ఇక వాటిలో నిజాయితీ ఏమిటి అన్నాను.

'అయితే మరి నేనో చిన్నకథ చెప్పనా' అన్నాడు వెనువెంటనే తడుముకోకుండా.

'మీరు రాసినదేనా' - అని అడిగాను.

"నేను రాసినవి మాత్రమే చెప్పాలా ఏం? కాలేజీ రోజుల్లో చదివిన జ్ఞాపకం. రచయిత ఎవరో కూడా తెలియదు కానీ ఆ కథ ఎందుకో నా బుర్రలో ఇంకిపోయి అనుక్షణం నన్ను ప్రభావితం చేస్తూ ఉంటుంది." - అని గొంతు సవరించుకొన్నాడు.

మధ్యలో ప్రశ్నలు వెయ్యరాదని అనుభవంతో తెలుసుకున్నవాడిని కనక శ్రద్ధగా వింటున్నాను.

"పేరున్న చిత్రకారుడొకడు కళాభవనంలో తన చిత్రాల్ని ప్రదర్శనకు పెట్టాడు. అక్కడ చేరిన కళాభిమానులు ఒక చిత్రాన్ని తదేకంగా చూసి మెచ్చుకొంటున్నారు. అందులో రెండు ఆబోతులు కసిగా ఒకదాన్నొకటి నెట్టుకొంటూ పోట్లాడుకొంటున్నాయి. వాడిగా వంపుతిరిగిన కొమ్ములు, బలిష్టమైన కాళ్ళు, వ్రేలాడే గంగడోలు, ఎత్తైన మూపురాలు, పాలలో కడిగినట్టు మెరిసిపడే శరీరాలు, నేలను బలంగారాస్తున్నట్టున్న గిట్టలు చూస్తూ ఎంతో సజీవంగా ఉన్న ఆ చిత్రాన్ని నగరవాసులు ఇంగ్లీషులో తెగ మెచ్చేసుకుంటున్నారు. ఆమాటలు అర్థంకాక అక్కడ ఏం జరుగుతుందో అని చూడవచ్చిన రైతు చిత్రాన్ని చూస్తూనే పక్కున నవ్వాడు. అక్కడే ఉన్న చిత్రకారుడు ఆ నవ్వుకి కారణం అడిగాడు.

"పోట్లాడుకునే ఏల తోకల్ని చుట్టు తిప్పి కొసలు ఒంటికి అతికించుకుంటాయి కానీ ఇలా జండాల్లాగా గాలిలోకి ఇడిసి పెడతాయా? అన్నాడు.

ఈ కథనే చదవివాక ఎన్నోసార్లు ఉత్కంఠతో పరిశీలించాను. రైతు చెప్పింది అక్షరాలా నిజం. ఆవులూ దూడలూ మేత మేసుకొంటూ రైలుకట్టకు ఇరువేపులా గుంతల్లో నిలిచిన నీళ్ళు తాగుతూవుంటాయి. దడదడ శబ్దం చేస్తూ రైలుబండి దగ్గరగా రాగానే బెదిరి దూరంగా పారిపోయేటప్పుడు తోకల్ని ఎగరవేసుకొంటూ పోతాయి. పోట్లాడే సమయంలో తోకలు గాలిలోకి ఎగురవెయ్యవు. పరిశీలనా బలమూ అనుభవమూ లేకుండా కేవలం ఊహలతో అల్లిన కథలు నే చదివినప్పుడు ఈ చిత్రకారుడి కథ- జ్ఞాపకం వస్తుంది. ఎరగని ప్రదేశాలూ సంఘటనలూ కథల్లో ప్రస్తావించినప్పుడు తప్పులు దొర్లకమానవు" - అన్నాడు శేఖరం.

నా అప్రస్తుతమైన నవ్వు కారణంగా ఇంత విలువైన వివరణ రాబట్టుకున్నందుకు సంతోషించాను.

నేను పదిరోజులపాటు ఆఫీసు పని మీద ముంబాయి వెళ్ళివచ్చాను. అదే రోజున శేఖరం, భార్యా వాళ్ళ కొడుకూ కోడలూ ఉన్న అహమ్మదాబాద్ వెళ్ళి నెలరోజులుండి వచ్చారు. ఇన్ని రోజులూ నాకు ఏమీ తోచక పత్రికల మీద పడి అక్షరం విడవకుండా చదువుతూ వచ్చాను. అవార్డులేవో ప్రకటించడాలూ వాటి వెనుక వెంపరలాటలూ ఇచ్చిన అవార్డుల మీద విమర్శలూ ప్రతివిమర్శలూ రాజకీయాలూ చదివాను. ఈ స్థితి తెలుగు సాహిత్యంలో నేనా, అన్నింట్లోనూ ఇలాగే ఉందా అని నా ఆలోచనలు సుడులు తిరిగేవి. శేఖరం తిరిగి రాగానే "ఇక్కడ వార్తలేమిటి" అన్నాడు. మీరు చదివలేదా వార్తపత్రికలు అని అడిగాను. "అక్కడంతా గుజరాతీ. నేనుండే ప్రాంతంలో తెలుగు పత్రికలే దొరకవు. ఇక తెలుగు వార్తలెక్కడ" అన్నాడు. అవార్డుల మీద నాలోని అశాంతినీ ఆగ్రహాన్నీ ఎంత దాచినా నా మాటల్లో కాస్త తొణికి ఉందేమో. శేఖరం పసిగట్టినట్టున్నాడు. "ఒక కథ చెప్తా వింటారా; అది కథకాదు జరిగినదే" అంటూ మాట సవరించుకుని ప్రారంభించాడు.

"గుర్తింపు కోసమే చెట్లు ప్రాణవాయువును విడిచి పెడతాయా. పూలు పరిమళిస్తాయా. అది వాటి సహజ ధర్మం. వైద్యశాస్త్రం అధ్యయనం చేసి,డాక్టరు వృత్తిలో ఉన్న క్రానిన్ అనేవాడు కడుపునొప్పి కారణంగా చప్పిడితిండి తింటూ మంచం మీద విశ్రాంతి తీసుకోక తప్పలేదు. గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోలేక కాగితాలు తీసుకుని ఒక నవల రాశాడు. దానిపేరు 'హాటర్స్ కాసిల్'. అన్యూహమైన ప్రచారాన్నీ, విజయాన్నీ (ఆర్థికంగా) సాధించింది. ఎన్నో గుర్తింపులు వచ్చాయి. ఇక వైద్య వృత్తినే విడిచి రచయితగా స్థిరపడిపోయాడు. ఎలా రచనా వ్యాసంగం ప్రారంభించాడో ఒక వ్యాసంలో చెప్తూ అన్ని గుర్తింపుల్లోకి అరుదైనదీ అమూల్యమైనదీ ఒక్కటే ఒకటి అని ప్రస్తావించాడు."

ఆత్రుతగానే వింటున్నాను. ఈ ముచ్చటనేనెన్నడూ వినలేదు కాబట్టి.

"ఒకరోజు లండన్‌లోని ఒక వీధిలో నడుస్తూవుంటే తనతో ఏ పరిచయమూ, లావాదేవీలూ లేని ఒక వ్యాపారి తన దుకాణానికి హాటర్స్ కాసిల్ అని పేరు పెట్టుకున్నాడట. అలాటి ఆత్మానందం ఆ దుకాణదారు చేత కోరి పేరు పెట్టించుకుంటే వస్తుందా? ఏ క్షణాన్న వస్తుందో చెప్పకుండా నిద్ర మనని వశం చేసుకుని వాలినట్టు ఏదన్నా ప్రశంసా గుర్తింపూ రావాలి. అది రచనలోని బలంతోనే వచ్చి కాలానికి ఓడక నిలుస్తుంది." అన్నాడు. ఇంకా ఏదో చెప్పేలా ఉన్నాడు. ఆ ప్రవాహాన్ని ఆపదల్చుకోక వింటున్నాను.

"అలౌకికమైన అందానికి పరవశించినప్పుడో, అమానుషమైన నేరాన్నో ఘోరాన్నో చూసి మనసు వ్యాకులమైపోయినప్పుడో అపురూపమైన ఆలోచన విరిసినప్పుడో ఒక రచన హృదయాన్ని చీల్చుకుని వెలువడుతుంది" అని నాలోని ఆవేదన గ్రహించిన వాడిలా చూశాడు.

సంక్రాంతి పండుగ రోజులు. మధ్యాహ్నాపుటెండ వేడి తగ్గాక ఏమీతోచక అతని ఇంటివేపు వెళ్ళాను. దూరాన్నించి చూస్తే ఏదో పనిలో నిమగ్నమైనట్టు సంపంగపొద పక్కన కనపడ్డాడు. ఎదురుగా ఉన్న రెండు కాకులకు వేరుశనగ పలుకులు విసురుతున్నాడు. అవి నోటితో అందుకుని అతనికి దగ్గర దగ్గరగా జరుగుతున్నాయి.

నన్ను చూస్తూనే "రండి రండి ఈ కాకులు చూశారా? చాలా గడుసు కాకులు. మనుషుల్ని సాధారణంగా నమ్మవు. దగ్గరగారావు. ఇలా ఇంత దగ్గరకు వచ్చాయంటే నన్ను ఎంతో గౌరవించినట్టే కదా" అన్నాడు నవ్వుతూ.

"పదండి డాబా మీదకు పోయి చెట్టునీడలో కూర్చుని పతంగులు చూస్తూ మాట్లాడుకుందాం" అని మెట్లమీదకు దారితీశాడు. అప్పుడే వేగిన జంతికలు పళ్ళెంలో పెట్టి తెచ్చింది- అతనిభార్య. దూరంగా ఉన్న మేడలూ మిద్దెల మీంచి గాలిపటాలు విడిచిపెడుతున్నారు. ఆకాశంలో ఎన్నో ఇంద్రధనస్సులు విరిసినట్లున్నాయి. గాలిలో కవ్వింపులు, బలాబలాలు ప్రదర్శనలు, చిన్న పిల్లల కేకలు పెద్దల హూంకరింపులు. ఖీంచో, కాటో, ధాగా పిలాయించు, పలటాయించు అన్న అరుపులు వినిపిస్తున్నాయి. ఒక పతంగి ఇంకో పతంగి కుత్తుకనుకత్తిరించడం, తెగిన పతంగి మెలికలు తిరిగిపోతూ వాలిపోతూవుంటే దాని వెనుక నాదీ నాదీ అంటూ పిల్లలు కర్రా కంపా పట్టుకు పరుగులెత్తడం నేను చూస్తున్నాను. ఆ పరుగులో తట్టుకు పడిన వాడొకడూ, తోసిన వాడొకడూ, చొక్కా చిరిగినా చూసుకోనివాడొకడూ, అందరి ధ్యాస ఆ పతంగిని దక్కించుకోవాలనీ అందనివాడు దాని పేలికగా చేసి విడిచి పెట్టాలనీ పరుగులో ఉన్నారు. ఉన్నట్టుండి నా దృష్టి శేఖరం మీద పడింది. అతని కళ్ళు వినీలాకాశంలోకి చూస్తున్నాయి. విరిసే గాలిపటాల దిశగా చూస్తున్నాడు. ఉయ్యాల మీద కట్టిన రంగు రంగుల చిలుకల్ని కన్నార్పకుండా చూసే కేరింతల శిశువులా ఉన్నాడు ఆక్షణంలో. ఒక ఆకు పచ్చని గాలిపటం తెగి, గాలివాటున హంసలా తేలి శేఖరం ఒడిలో వాలింది. ఎక్కడా చిరుగులేదు. దాన్ని తీసి ప్రసన్నంగా చూస్తున్నాడు. ఇంతలోనే మెట్లెక్కి వగరుస్తూ ఆయసపడుతూ ఒక పిల్లవాడు మాటలందక 'తా.... త.... య్యా ఈ పతంగీ.... నాదీ' అన్నాడు.

'అవున్రా ఇది నీదే... నీకోసమే దాచాను.....' అని అందించాడు. జారిపోతున్న లాగును ఎగదోసుకొంటూ వాడు క్రిందకి పరుగుతీశాడు.

ఎవడువాడు? అన్నాను.

'ఈ బస్తీలో నేను సంపాదించుకున్న మనవల్లో ఒకడు' - అన్నాడు. అతని కథల్లోని ఆకర్షణకు ఈ వాడకుండా దాచుకున్న పసితనమా కారణం అని ఆశ్చర్యపోతూ వుంటే నా వేపు ప్రసన్నంగా చిరునవ్వుతో చూస్తూ ' నేను- నాదీ అన్న అస్తిత్వకాంక్షని ఏ వ్యవస్థలోనైనా నిర్మాణాత్మకంగా నియంత్రించుకోగలమే తప్ప నిర్మూలించడం అసాధ్యం. యోగులుగా అందరూ నిచ్చన చివరకు పోలేరు కదా'' అన్నాడు.

ఆలస్యంగా ఇంటికి వెళ్ళిన నన్నుచూసి నా శ్రీమతి ''పోనీ మీరూ కథలు రాయరాదూ' అంది హాస్యధోరణిలో. నాకు ఆ ఓర్పూ నేర్పూ అబ్బక పోయినా శేఖరాన్ని ఈ కథలో బంధించాలని చిన్న సాహసం చేశాను. దురాశ అంటారా?

✣ ✣ ✣

*ఆంధ్రభూమి (ప్రియదర్శిని) 19 - ఫిబ్రవరి 2005*

✣ ✣ ✣